www.nagaranijam.com

PRGI/RNI NO : APTEL/2013/54450

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు :
☎ 82474 67562
Email Id : nagaranijam@gmail.com

# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక




| సంపుటి : 14 | సంచిక : 74 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 6,శనివారం,జూన్, 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 14 | Issue : 74 | Rangareddy | Editor : Aela.Purushotham | 6,Saturday,June,2026 | Pages : 4+ | Price : 3/- |

Published From Rangareddy, Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad



# ఉమ్మడి పాలమూరును సస్యశ్యామలం చేస్తాం

# ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి





మహబూబ్‌నగర్, 5 జూన్ (నగర నిజం) :ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టిన సాగు, తాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు.గత రెండు రోజులుగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల పనులను మంత్రులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ముఖ్యమంత్రి, కొత్తూరు కరివెన రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, జూరాల, కోయిల్ సాగర్ వంటి కీలక ప్రాజెక్టులు గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు.ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తి చేయకుండా పంపులు, లిఫ్టులపై భారీగా ఖర్చు చేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల పేరుతో రూ. 84,503 కోట్ల అప్పు చేయగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 30 నెలల్లో అసలు, వడ్డీ కలిపి రూ. 52,121 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు.అప్పులు, వడ్డీ చెల్లింపులతో పాటు కొత్తగా ప్రాజెక్టుల కోసం రూ. 22 వేల కోట్లు ఖర్చు చేశామని, అందులో రూ. 8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులకే కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి కోసం మరో 4 వేల ఎకరాల భూసేకరణ అవసరమని, రైతులు కోరిన ధర కంటే కొంత ఎక్కువ చెల్లించాల్సి వచ్చినా భూసేకరణ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టుల పనులను గరిష్ట స్థాయిలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. రిజర్వాయర్ల నిర్మాణం, నిలిచిపోయిన పనుల పునరుద్ధరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.కర్ణాటక సరిహద్దు వద్ద బ్రిడ్జ్ కమ్ బ్యారేజ్ నిర్మాణంపై సాంకేతిక నిపుణులతో చర్చించి, కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం సాధించి ముందుకు వెళ్తామని వెల్లడించారు. పాలమూరు-రంగారెడ్డి నుంచి ఉద్దండాపూర్ వరకు ఉన్న అడ్డంకులను తొలగిస్తూ 2027 నాటికి పంపులు, లిఫ్టులు, కాలువల పనులను పూర్తి చేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.పాలమూరు ప్రాజెక్టుల పూర్తి విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని ఎవరూ శంకించాల్సిన అవసరం లేదని, తాను ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా మరింత బాధ్యతతో పనిచేస్తానని ముఖ్యమంత్రి అన్నారు.ధాన్యం కొనుగోళ్లపై స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనేక ఇబ్బందులను అధిగమిస్తూ 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వడ్లు కొనుగోలు చేయకపోవడం సరికాదన్నారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా యూరియా కేటాయించాలని కేంద్రాన్ని కోరారు.నీటి హక్కుల అంశంపై మాట్లాడుతూ గోదావరి జలాల్లో తెలంగాణకు 968 టీఎంసీల నికర జలాల కేటాయింపులు ఉన్నాయని, ఒక్క చుక్క నీటి విషయంలో కూడా రాజీ పడబోమని స్పష్టం చేశారు. కృష్ణా జలాలపై ఉన్న సమస్యలను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పరిష్కరించేందుకు చివరి వరకు పోరాడతామనితెలిపారు.మహారాష్ట్రతో సంప్రదింపులు జరిపి తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అమలుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ విషయంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రికి ఇప్పటికే లేఖ రాసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

## ఐకార్-సీఆర్ఐడీఏలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం





హైదరాబాద్, 5 జూన్ (నగర నిజం) :ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా ఐకార్-సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ (సీఆర్ఐడీఏ) ప్రధాన క్యాంపస్‌లో మిషన్ లైఫ్ కింద "ఏక్ పెడ్ మా కే నామ్" మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, సుస్థిర జీవనశైలిపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "ఏక్ పెడ్ మా కే నామ్" ప్రచారంలో భాగంగా ఐకార్-సీఆర్ఐడీఏ డైరెక్టర్ డాక్టర్ వి.కె. సింగ్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ప్రతి వ్యక్తి తమ తల్లి గౌరవార్థం ఒక చెట్టును నాటి, దానిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో వ్యక్తిగత బాధ్యత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మిషన్ లైఫ్ లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రోజువారీ జీవితంలో పర్యావరణ హిత చర్యలు, సుస్థిర పద్ధతులను అలవర్చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని సంకల్పించారు.నిరంతర మొక్కల పెంపకం, సంరక్షణ కార్యక్రమాల ద్వారా పచ్చదనాన్ని విస్తరించడంతో పాటు పర్యావరణ అవగాహనను మరింత పెంపొందించాలనే సామూహిక సంకల్పంతో కార్యక్రమం ముగిసింది.

### పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల పరిశీలనకు కరివేన జలాశయానికి ముఖ్యమంత్రి



మహబూబ్ నగర్, 5 జూన్ (నగర నిజం) :పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల సాగు పథకం (పీఆర్ఎల్ఐఎస్) పనుల పురోగతిని పరిశీలించేందుకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కరివేన జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పుష్పగుచ్ఛం అందించి ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు.అనంతరం ముఖ్యమంత్రి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీలు 14, 15 పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల ప్రస్తుత స్థితి, నిర్మాణ పురోగతి, ఎదురవుతున్న సాంకేతిక అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.పథకాన్ని వేగవంతంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పనుల నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోపు పూర్తి చేసే అంశంపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆరా తీసినట్లు సమాచారం.

# పుప్పాలగూడలో హైడ్రా భారీ ఆపరేషన్

**200 ఎకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్**

**రూ. 30 వేల కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా**

**హైకోర్టు తీర్పు మేరకు హైడ్రా రక్షణ చర్యలు**

**250 కోట్ల సంవత్సరాల చరిత్రను కాపాడిన హైడ్రా**

**ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి హైడ్రా నీరాజనం**



హైదరాబాద్, 5 జూన్ (నగర నిజం) :ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. ప్రకృతిని పరిరక్షిస్తూ చారిత్ర రాళ్ల గుట్టలతో పాటు.. ఆతి పురాతన రాతి గుహలు, వాటి మధ్యన ఉన్న చెట్లూ.., చేమను హైడ్రా కాపాడింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ - ఖాజాగూడ సరిహద్దుల్లో శుక్రవారం 198 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ఇందులో 250 కోట్ల సంవత్సరాల చారిత్రక రాళ్ల గుట్టలు కూడా ఉన్నాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ ఎం డీ ఏకు కేటాయించిన 200ల ఎకరాలు కూడా ఉన్నాయి. చారిత్రక గుట్టలను కాపాడాలని కోరుతూ దశాబ్దాలుగా -సొసైటీ టూ సేవ్ రాక్స్- ప్రతినిధులు పోరాడుతున్నారు. హైకోర్టును కూడా వీరు ఆశ్రయించారు. ఈ మేరకు రాతి గుట్టలతో పాటు.. ప్రభుత్వ భూమిని కాపాడాలని 2019లో మున్సిపల్, రెవెన్యూ శాఖలకు హైకోర్టు ఆదేశించింది. హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడం జాప్యం కావడంతో కబ్జాలకు ఆస్కారం ఇచ్చినట్టయ్యింది. ఇదే విషయాన్ని -సొసైటీ టూ సేవ్ రాక్స్- ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో గతంలోనే పరిశీలించారు. రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుని శుక్రవారం ఫెన్సింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ భూమి విలువ రూ. 30వేల కోట్లు వరకూ ఉంటుందని అంచనా.

## రెవెన్యూ రికారక్డుల మేరకు..

సర్వే నంబరు 452/1 లో 174 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అలాగే 454/1 సర్వే నంబరులో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మొత్తం 293.05 ఎకరాలు కాగా.. ఇందులో 263.05 ఎకరాలను గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ ఎండీఏకు కేటాయించింది. రెండు గ్రామాల మధ్య ఓవర్‌ల్యాప్ ఇష్యూలతో 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా రెవెన్యూ అధికారులు గుర్తించారు. దీంతో హెచ్ ఎం డీఏకు 200ల ఎకరాలు మాత్రమే మిగిలాయి. ఇవే చారిత్రక గుట్టల ప్రాంతంలో వివిధ దేవాలయాలకు 5 ఎకరాలు కేటాయించగా.. దర్గాకు 5 ఎకరాలు అప్పజెప్పినట్టు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఇలా ఎవరికి కేటాయించిన భూములు పోగా.. 200 ఎకరాల హెచ్ ఎం డీ ఏ భూమిని హైడ్రా శుక్రవారం కాపాడింది. -సొసైటీ టూ సేవ్ రాక్స్- ప్రతినిధులు కోరిన విధంగా అక్కడ చారిత్రక బండ రాళ్లను కూడా హైడ్రా కాపాడినట్టయ్యింది. మంచి వ్యూ పాయింట్‌తో ..ఎంతో ఎత్తుగా.. సహజ సిద్ధంగా ఉన్న గుట్టలను, 250 కోట్ల సంవత్సరాల చరిత్ర గల కొండలను కాపాడి ప్రకృతిని పరిరక్షించారంటూ రాక్ సొసైటీ ప్రతినిధులు హైడ్రాను కొనియాడారు. రాళ్ల గుట్టలతో పాటు పలు ఆలయాలున్న చారిత్రక స్థలంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కాపాడిన హైడ్రా కు ప్రజలతో పాటు భక్తులు, పర్యావరణ ప్రేమికులు అభినందనలు తెలిపారు. దశాబ్దాల సమస్యను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవను అభినందించారు. ఈ గుట్టలను అనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒక పక్క ఎత్తైన కొండ.. దిగువ భాగంలో ఉన్న భగీరథమ్మ చెరువు సిద్ధమైతే.. ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతుందని పలువురు ఈ సందర్భంగా పేర్కొన్నారు.





నగరనిజం

6 శనివారం, జూన్ 2026

# భక్తుల సౌకర్యార్థం నీటి సంపు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన బీఆర్ఎస్ నాయకులు జాలిగం రాకేష్





**కుత్బుల్లాపూర్, 5 జూన్ (నగర నిజం ప్రతినిధి):** 132వ డివిజన్ పరిధిలోని ప్రసన్న నగర్ కాలనీలో ఉన్న శ్రీ కోదండ రామాలయం వద్ద అయ్యప్ప స్వాములు, శివ స్వాములు మరియు ఆలయానికి వచ్చే భక్తులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు జాలిగం రాకేష్ కీలక ముందడుగు వేశారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తన సొంత నిధులతో నిర్మించనున్న నీటి సంపు పనులకు గురువారం భూమి పూజ నిర్వహించి శ్రీకారం చుట్టారు.ప్రతిరోజూ ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తుండగా, ముఖ్యంగా పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు మరియు ఆధ్యాత్మిక వేడుకల సమయంలో తాగునీటి కొరత తీవ్రంగా ఎదురవుతుండేదని స్థానికులు తెలిపారు. ఈ సమస్యను గుర్తించిన జాలిగం రాకేష్ భక్తుల ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకొని వెంటనే స్పందించి నీటి సంపు నిర్మాణానికి ముందుకు రావడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.భూమి పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడింది. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు విజయవంతంగా పూర్తవ్వాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జాలిగం రాకేష్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రతి నాయకుడి బాధ్యత అని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాశ్వత పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో ఈ నీటి సంపు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రసన్న నగర్ కాలనీ ఆలయ కమిటీ అధ్యక్షులు జి. రమేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సిహెచ్. మారే బాబు తదితర కాలనీవాసులు అందరు పాల్గొన్నారు.

# శామీర్‌పేట చెరువు నీటి అక్రమ తరలింపుపై అధికారుల చర్య



## ● అనుమతులు లేకుండా వేసిన పైప్‌లైన్ ధ్వంసం

**మేడ్చల్, జూన్ 5 (నగర నిజం):** పూడూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని శామీర్‌పేట పెద్ద చెరువు నుంచి అక్రమంగా నీటిని తరలిస్తున్న ప్రైవేట్ వ్యక్తికి చెందిన పైప్‌లైన్‌ను శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు ధ్వంసం చేశారు.ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా శామీర్‌పేట చెరువులో నుంచి భారీ కాలువ తవ్వి పైప్‌లైన్ ద్వారా నీటిని వ్యవసాయ క్షేత్రాలకు తరలిస్తున్నారన్న ఫిర్యాదులు అందడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.ఈ మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చందన్ రెడ్డి, జీపీఓ సునీత, ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్ ఈర్షద్ తదితర అధికారులు రెవెన్యూ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. చెరువు నుంచి అక్రమంగా నీటిని మళ్లించేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్ నిర్మాణాలను గుర్తించి వాటిని ధ్వంసం చేశారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా చెరువుల నుంచి నీటిని తరలించడం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు, వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడే చెరువు నీటిని అక్రమంగా మళ్లించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.భవిష్యత్తులో ఇలాంటి అక్రమ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. చెరువులు, కాలువలు మరియు ఇతర జలవనరుల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.



# టైగర్స్ కుంగ్-ఫు & కరాటే అకాడమీ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ విజయవంతం



**రంగ రెడ్డి జూన్ 5 :** రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని బచ్‌పాన్ స్కూల్ గ్రౌండ్‌లో టైగర్స్ కుంగ్-ఫు & కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ఘనంగా నిర్వహించబడింది. అకాడమీ రంగారెడ్డి జిల్లా ఆర్గనైజర్ మునుకుంట్ల శివ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 70మంది విద్యార్థులు పాల్గొన్నారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హయత్‌నగర్ ఎస్సై వెంకట్ రెడ్డి , స్కూల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి గారు మరియు గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్ , హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. బెల్ట్ గ్రేడింగ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారి చేతుల మీదుగా బెల్టులు మరియు ప్రశంసా పత్రాలు అందజేయగా, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లలకు చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ కూడా ఎంతో అవసరమని తెలిపారు. కుంగ్-ఫు సాధన ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం పెంపొందుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలు, బాలురకు ఆత్మ రక్షణ నైపుణ్యాలు అవసరమని, మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఎలాంటి పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కొనే శక్తి లభిస్తుందని అన్నారు.కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న తల్లిదండ్రులు విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా మాస్టర్ మునుకుంట్ల శివ గౌడ్, బ్లాక్ బిల్డర్స్ క్రాంతి, కార్తికేయ జేతిను తదితరులు పాల్గొన్నారు.



# మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల విజయోత్సవాల్లో భాగంగా నల్ల జై శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా 'ఏక్ పెడ్ మా కే నామ్' వృక్షారోపణ కార్యక్రమం



**కుత్బుల్లాపూర్, 5 జూన్ (నగర నిజం ప్రతినిధి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ గ్రామం పాటిగడ్డలోని రుక్మిణి ఎస్టేట్స్ పార్క్ (286 డివిజన్)లో "ఏక్ పెడ్ మా కే నామ్" (ఒక మొక్క అమ్మ పేరుతో) వృక్షారోపణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జాతీయ మరియు రాష్ట్ర నాయకత్వాల పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానిక ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా పార్క్ పరిసర ప్రాంతాల్లో వివిధ రకాల నీడ, పండ్ల మరియు అలంకార మొక్కలను పెద్ద ఎత్తున నాటారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల ప్రాధాన్యత ఎంతో కీలకమని నాయకులు పేర్కొన్నారు. వేగంగా పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ, "ప్రకృతిని కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడటమే. ఒక మొక్కను నాటడం మాత్రమే కాకుండా దానిని చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబం ప్రకృతితో మరింత అనుబంధం పెంచుకోవాలి" అని పేర్కొన్నారు.అలాగే కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ చర్యలు దేశవ్యాప్తంగా మంచి ఫలితాలను ఇస్తున్నాయని, అన్నారు.

## పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై గ్రామస్తులతో ప్రమాణం జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు మన్నే కళ్యాణ్

**మొక్కలు నాటాలని గ్రామస్తులతో ప్రమాణం.**



మనోహరాబాద్ మండలంలోని కోనాయిపల్లి గ్రామంలో గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు మన్నే కళ్యాణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామ సభలో పర్యావరణ పరిరక్షణ, గ్రామ పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు.గ్రామ సభలో పాల్గొన్న గ్రామస్తులు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, పర్యావరణాన్ని కాపాడడం, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, తడి-పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించడం వంటి అంశాలపై ప్రమాణం చేశారు.ఈ సందర్భంగా గ్రామ సెక్రటరీ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు మహేష్, సురేష్, లావణ్య, అర్జున్, గ్రామస్తులు, ఆశా వర్కర్లు, నర్సులు తదితరులు పాల్గొన్నారు.కోనాయిపల్లి లో గ్రామ సభ నిర్వహణపర్యావరణ పరిరక్షణపై అవగాహనతడి-పొడి చెత్త వేర్వేరుగా నిర్వహించాలని సూచనగ్రామ పరిశుభ్రతకు అందరి సహకారం అవసరం


# చిన్నారుల కోరిక మేరకు క్రికెట్ కిట్ అందజేసిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జాలిగం రాకేష్





**కుత్బుల్లాపూర్, 5 జూన్ (నగర నిజం ప్రతినిధి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 131వ డివిజన్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద చిన్నారుల కోరిక మేరకు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు జాలిగం రాకేష్ చిన్నారులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా జాలిగం రాకేష్ మాట్లాడుతూ, చిన్నారులు మరియు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం ఎంతో అవసరమని తెలిపారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం వంటి మంచి గుణాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన చిన్నారులను ప్రోత్సహించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చిన్నారుల అభిరుచులను గుర్తించి, వారికి అవసరమైన క్రీడా సామగ్రిని అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, చిన్నారులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని జాలిగం రాకేష్‌కు అభినందనలు తెలిపారు."క్రీడలను ప్రోత్సహిద్దాం... చిన్నారుల కలలను సాకారం చేద్దాం... ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి క్రీడలే పునాది" అంటూ కార్యక్రమం ముగిసింది.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్



**కుత్బుల్లాపూర్, 5 జూన్ (నగర నిజం ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కృష్ణకాంత్ పార్క్‌లో గురువారం ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమిషనర్ సంతోష్ బాధవత్ పాల్గొని మొక్కలు నాటారు.అనంతరం తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో రూపొందించిన "పర్యావరణ పరిరక్షణ-2026" పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా కాకుండా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని సూచించారు.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటిని పొదుపుగా వినియోగించడం, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం వంటి చర్యల ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని, తద్వారా పచ్చదనంతో కూడిన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వెంగళ రావు డివిజన్ యాదవ సంఘం చైర్మన్ పాపయ్య యాదవ్, యాదవ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ యాదవ్, యాదవ సంఘం జనరల్ సెక్రటరీ పసుపుల నాగరాజు యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్‌లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నగరనిజం



# మెదక్ అర్బన్ ఫారెస్ట్ పార్కుల గొప్పతనాన్ని పర్యాటకుల కు ప్రాచుర్యం కల్పించాలి

- మెదక్ ఫారెస్ట్ ను టూరిస్ట్ హబ్ గా రూపొందించాలి
- జిల్లావ్యాప్తంగా గ్రీన్ యాక్షన్ ప్లాన్ తయారీకి పటిష్ట ప్రణాళిక
- ప్రపంచ పర్యావరణ దినోత్సవ శు భాకాంక్షలు కలెక్టర్
- 200 చెట్లతో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ప్రారంభోత్సవం
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**మెదక్ బ్యూరో : నగర నిజం : ,05 జూన్ -2026** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామం వన్ యోజన అటవీ పార్కు నందు నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్). హైదరాబాదు నుండి రత్నాకర్, డి ఎఫ్ ఓ జోజి, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈ ఈ వేణు, సంబంధిత ఎఫ్ ఆర్ ఓ ,రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, యాదగిరి, శర్మ రాజశేఖర్ సర్పంచ్ యాదగిరి, ఉపసర్పంచ్ ప్రసాద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు.అనంతరం అటవీ శాఖ ఏర్పాటు పర్యావరణ పరిరక్షణపై జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రకారం జిల్లాలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఏక్ పెడ్ మా కే నామ్' ప్రతి భారతీయుడిని తమ తల్లి మరియు భూమాత గౌరవార్థం ఒక మొక్కను నాటమని ప్రోత్సహించే ఒక హృదయపూర్వక దేశవ్యాప్త పర్యావరణ ఉద్యమం. అన్నారు. ఇది మాతృత్వంలోని పోషణ స్ఫూర్తిని, ప్రకృతి యొక్క జీవనాధార శక్తితో అనుసంధానించి, మరింత పచ్చని గ్రహాన్ని పెంపొందుతుంది అన్నారు.మొక్కలు నాటుతున్నప్పుడు, మీ అమ్మ ప్రేమను, త్యాగాలను గౌరవించడానికి ఒక్క క్షణం కేటాయించాలని హితవు పలికారు. మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారాల అనే నినాదంతో ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటినీ సంరక్షించి భవిష్యత్తులో వృక్షాలుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. అటవీ సంపద సంరక్షణ, జీవ వైవిధ్యం పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణకు సంబంధించి అంశాలపై విద్యార్థి దశ నుండే తెలుసుకోవాలన్నారు.జిల్లాలో 24% అటవీ సంపద ఉందని ,జిల్లాలో నర్సాపూర్, వడియారం, పరికిబండ, మనోరాబాద్ అర్బన్ ఫారెస్ట్ పార్కులను హైలెట్ చేయడం జరుగుతుందన్నారు.ఈ ప్రాంతంలో ఉన్న ఫారెస్ట్ కు పిల్లలకు ప్రత్యేక టూర్ అరేంజ్ చేసి వారందరికీ జిల్లాలో అటవీ సంపద ఫారెస్ట్ పార్కులు మొక్కల వల్ల భావితరాలకు ఉపయోగం సంబంధిత విషయాలపై అవగాహన కల్పించాలన్నారు.జిల్లాలో అటవీ సంపదను పరిరక్షించడంలో అటవీశాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. భవిష్యత్ తరాలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేలా అడవులను సంరక్షించేందుకు ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నారని వివరించారు.జిల్లాస్థాయి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా అర్బన్ ఫారెస్ట్ పార్కుల పర్యాటకులకు ప్రాచుర్యం పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రత్నాక జోహారీ మాట్లాడుతూ.. జిల్లాలో వరల్డ్ ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని మానవాళి మనుగడకు చెట్లే ప్రతిరూపంగా ఉంటాయన్నారు విశాఖపట్నంలో సునామీ ఏర్పడినప్పుడు చెట్లు ఉన్న ప్రాంతాలలో దాని యొక్క తాకిడి చాలా తక్కువ మొత్తంలో ఉన్నది అంటే చెట్ల యొక్క ప్రాముఖ్యత తెలుసుకోవాలన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ అటవీ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు జిల్లా అధికారులు ,ప్రజా ప్రతినిధులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ విద్య ప్రవేశ పరీక్షలో పటాన్‌చెరు విద్యార్థిని సత్తా

- ఐదేళ్ల లాసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించిన వర్షిణి రెడ్డి



**నగర నిజం జూన్ 05** సంగారెడ్డి జిల్లా ?పటాన్‌చెరు, న్యాయ విద్య ప్రవేశ పరీక్ష (లాసెట్) ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన కోల్కూరి వర్షిణి రెడ్డి అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఐదేళ్ల న్యాయ విద్య కోర్సు ప్రవేశ పరీక్షలో ఆమె రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకును కైవసం చేసుకుని, జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.?వర్షిణి రెడ్డి సాధించిన ఈ ఘనత పట్ల ఆమె కుటుంబ సభ్యులు, విద్యావేత్తలు, స్థానిక ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షిస్తూ పలువురు అభినందనలు తెలిపారు.ఈ ఏడాది లాసెట్ పరీక్ష ఫలితాల్లో మరో ఆసక్తికరమైన అంశం చోటుచేసుకుంది. ఈ పరీక్షలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 39,673 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు.

## పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్




**ఇబ్రహీంపట్నం, జూన్ 5 ( నగరనిజం ) :** పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోబానగర్ సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో, ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఒక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సి.సుధాకర్, ఐఐసీ కోఆర్డినేటర్ డాక్టర్ కాండే శ్రీనివాస్, సెక్రటరీ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శేఖర్ బాబుతో పాటు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... మనం చెట్లను నాటడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మరియు ప్లాస్టిక్‌ను తొలగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని, తద్వారా మన భవిష్యత్తును ఆరోగ్యకరంగా మార్చుకోవాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ సి.సుధాకర్ మాట్లాడుతూ.. క్యాంపస్ శుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కలు నాటడం, పర్యావరణంపై అవగాహన వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విధ్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.౦

## వైఎస్ షర్మిలకు నిరాశ..

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల కర్ణాటక నుంచి రాజ్యసభకు పోటీ చేయబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా జోరుగా సాగిన ఊహాగానాలకు తెరపడింది. కాంగ్రెస్ అధిష్ఠానం తాజాగా ప్రకటించిన రాజ్యసభ అభ్యర్థుల తుది జాబితాలో షర్మిలకు చోటు దక్కలేదు. కర్ణాటక నుంచి ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానాలను భర్తీ చేసే క్రమంలో.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది.కర్ణాటక కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు వీరే:

మల్లికార్జున్ ఖర్గే: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు

పవన్ ఖేడా: ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి.

మన్సూర్ ఆలీ ఖాన్: కేంద్ర మాజీ మంత్రి రెహ్మాన్ ఖాన్ కుమారుడు.

మల్లికార్జున్ ఖర్గే ఈరోజు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ సీఎం సిద్ధరామయ్య సహా పలువురు కీలక నేతలు హాజరుకానున్నారు.

## విద్యకు బలమైన పునాది.. ప్రీ-ప్రైమరీ పాఠశాలలు: డీఈవో రాము






**మేడిపల్లి, జూన్ 05 (నగర నిజం)** చిన్నారుల విద్యాభ్యాసానికి బలమైన పునాది వేయడమే ప్రీ-ప్రైమరీ పాఠశాలల ముఖ్య ఉద్దేశమని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని ఎంపీపీఎస్ పోరుమల్ల పాఠశాలలో 36 రోజులుగా సమాజ భాగస్వామ్యంతో నిర్వహించిన కరాటే సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరంలో జగిత్యాల జిల్లాలో 51 ప్రీ-ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించగా, 2026-27 విద్యా సంవత్సరంలో మరో 69 ప్రీ-ప్రైమరీ పాఠశాలలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులకు ఆటల ద్వారా ఆనందభరితమైన వాతావరణంలో విద్యాబోధన అందించి, ప్రాథమిక విద్యకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యమన్నారు.ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో చిన్నారుల అభిరుచులకు అనుగుణంగా బొమ్మలు, టెడ్డీబేర్లు, విద్యా ఆట వస్తువులు, ఆకర్షణీయమైన గోడ చిత్రాలు, గ్రీన్ మ్యాట్లు, గ్రీన్ బోర్డులు, ప్రత్యేక లెర్నింగ్ కార్నర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయురాలు, ఒక ఆయమ్మ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం కావాలంటే ప్రజల సహకారం అవసరమని పేర్కొన్న డీఈవో, కరాటే వంటి శిక్షణలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. తల్లిదండ్రులు తమ మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను సమీప ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు.అనంతరం ఎంపీపీఎస్ పోరుమల్లలో ప్రీ-ప్రైమరీ పాఠశాలను ప్రారంభించి, 36 రోజుల కరాటే వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ భూమిరెడ్డి, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి యల్లా అమర్నాథ్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు కన్నవేణి మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వంజరి కులస్తులకు ఎస్టీ హోదా పునరుద్ధరించాలి







- అఖిల భారత వంజరి సేవా సంఘం డిమాండ్

**హైదరాబాద్, జూన్ 6:** తెలంగాణలో వంజరి కులస్తులకు గతంలో ఉన్న ఎస్టీ (షెడ్యూల్డ్ ట్రైబ్) హోదాను పునరుద్ధరించాలని, తక్షణ ఉపశమనంగా వారిని డి.ఎన్.టి గా గుర్తించాలని, అలాగే కుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అఖిల భారత వంజరి సేవా సంఘం మరియు తెలంగాణ వంజరి సేవా సంఘం డిమాండ్ చేశాయి.శుక్రవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, 1978 వరకు ఎస్టీలుగా పరిగణించబడిన వంజరి కులస్తులను ఒక జీవో ద్వారా బీసీ-డి వర్గంలోకి మార్చడం వల్ల ఐదు దశాబ్దాలుగా తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కులగణనలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని, ఆర్థికంగా వెనుకబడిన వంజరి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.వంజరి కుల ఆరాధ్య సంత్ అయిన భగవాన్ బాబా పుణ్యతిథిని అధికారికంగా నిర్వహించాలని, అలాగే ప్రముఖ రాజకీయ నాయకుడు గోపీనాథ్ ముండేకు భారతరత్న ప్రకటించి ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ నెల 7న ఉప్పల్ బాగాయత్‌లో నిర్మించిన వంజరి కుల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి హాజరుకానున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు వంజరి కుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంఘ నాయకులు కోరారు.ఉప్పల్ ఆత్మగౌరవ భవనం పూర్తిగా వంజరి కులస్తుల స్వంత నిధులతో నిర్మించబడిందని, గత ప్రభుత్వం ప్రకటించిన రూ.1 కోటి నిధులు ఇప్పటికీ విడుదల కాలేదని తెలిపారు. భవన అభివృద్ధి కోసం రూ.5 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే భవన నిర్మాణ ట్రస్టులో బీసీ సంక్షేమ శాఖ నిబంధనల ప్రకారం అన్ని నమోదిత వంజరి సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పదవీకాలం ముగిసినా ఇంకా పదవుల్లో కొనసాగుతున్నఎ వ్యక్తుల ఆధిపత్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకుని సంఘానికి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సాల్వేరు కృష్ణ, ఎదుగని శంకర్ నారాయణ, ఎరుగని హరినాథ్, ధాత్రికా కాశీనాథ్, యుగంధర్, కాలేరు సురేష్, ఎదుగని వెంకటేష్, శివప్రసాద్, రత్నం సంతోష్, అముద లక్ష్మణ్, మహదేవ్ ముండే తదితరులు పాల్గొన్నారు.

## హైటెక్స్‌లో 'థ్రెడ్ పోచంపల్లి' చేనేత పప్రదర్శన

- ఘనంగా ప్రారంభించిన
- మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ చామల



**హైదరాబాద్ / యాదాద్రి భువనగిరి:జూన్ 5:**యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ శ్రీ అనురాగ్ జయంతి నేతృత్వంలో హైదరాబాద్ హైటెక్స్ (HITEX) హాల్ నెంబర్ 4 లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్థాయి Thread. Pochampallyµ (థ్రెడ్ పోచంపల్లి)లి చేనేత ప్రదర్శన మరియు విక్రయ కేంద్రాన్ని రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి , రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మరియు చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు లితుమ్మల నాగేశ్వరరావు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ వైభవ ప్రారంభోత్సవ వేడుకలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరియు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఐఏఎస్ పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన, గజం అంజయ్య విశిష్ట అతిథులుగా పాల్గొని ప్రదర్శనలోని చేనేత స్టాళ్లను సందర్శించారు.

నగరనిజం

5 శనివారం, జూన్ 2026

## బాలికపై లైంగిక దాడి కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

- **ప్రత్యేక ప్రజా అభియోజకుడు విజయ్ రెడ్డి సమర్థవంతమైన వాదనలతో న్యాయం**



**మెడ్చల్, జూన్ 5 (నగరనిజం):** పెట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెం. 690/2023 కేసులో పోక్సో ప్రత్యేక న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. బాలికపై లైంగిక దాడి కేసులో నిందితులైన ఇద్దరిని దోషులుగా నిర్ధారిస్తూ జీవిత ఖైదు విధించింది. మెడ్చల్‌లోని పోక్సో ప్రత్యేక కోర్టు గౌరవ న్యాయమూర్తి కె. వెంకటేశ్ శుక్రవారం తీర్పు వెలువరించారు. కేసులో నిందితులైన శివకుమార్, శామ్యూల్ అలియాస్ సమేల్‌లను భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 376(డీబీ)తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(జి), 5(ఎం) రీడ్ విత్ 6 కింద దోషులుగా నిర్ధారించి జీవిత ఖైదు శిక్ష విధించారు. అదనంగా ఒక్కో నిందితుడికి రూ.10 వేల జరిమానా విధించగా, జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని ఆదేశించారు. అలాగే బాధిత బాలిక పునరావాసం కోసం జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) ద్వారా రూ.5 లక్షల పరిహారం అందించాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసు దర్యాప్తును అప్పటి ఇన్‌స్పెక్టర్ జి. ప్రశాంత్ అత్యంత నిష్పక్షపాతంగా నిర్వహించి, పటిష్టమైన సాక్ష్యాధారాలను కోర్టు ముందు ఉంచారు. కేసు విచారణలో ప్రత్యేక ప్రజా అభియోజకుడు వి. విజయ్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. కేసుకు సంబంధించిన అన్ని ఆధారాలను సమగ్రంగా కోర్టు దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు, చట్టపరమైన అంశాలను బలంగా వాదించి నిందితులకు కఠిన శిక్ష పడేలా కృషి చేశారు. ఆయన సమర్థవంతమైన వాదనలు, న్యాయపరమైన నైపుణ్యం ఈ కేసులో తీర్పు వెలువడటానికి ప్రధాన కారణంగా నిలిచాయని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పెట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కె. విజయ్ వర్ధన్ పర్యవేక్షణలో సీడీఓ ఎస్. నారాయణరావు, సమన్ల విభాగానికి చెందిన ఎం. రాజు, లైజన్ అధికారి యు. మౌనిక తదితరులు కేసు విచారణలో సమన్వయంతో పనిచేశారు. ఈ తీర్పు బాలలపై లైంగిక నేరాలకు పాల్పడే వారికి గట్టి హెచ్చరికగా నిలవడంతో పాటు, బాధితులకు న్యాయం అందించడంలో పోలీసు శాఖ, ప్రత్యేక ప్రజా అభియోజకుల వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోందనడానికి నిదర్శనంగా నిలిచింది.

## మృగశిర సందర్భంగా సాయి గీత ఆశ్రమంలో ఉచిత ఆస్థమా వైద్య శిబిరం

- **జూన్ 8, 9 తేదీల్లో మందుల పంపిణీ**
- **ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుల పిలుపు**




**మేడ్చల్ జూన్ 5 (నగరనిజం):** మృగశిర కార్తె సందర్భంగా కండ్లకోయ్యలోని సాయి గీత ఆశ్రమం ఆధ్వర్యంలో జూన్ 8, 9 తేదీలలో ఉచిత ఆస్థమా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఆస్థమా ఇతర శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ శిబిరంలో ఉచితంగా వైద్య సలహాలు, మందులు అందించనున్నట్లు వెల్లడించారు. మృగశిర నాడు అందించే ప్రత్యేక ఆయుర్వేద మందు శ్వాస సంబంధిత సమస్యలకు ఉపశమనం కలిగిస్తుందనే విశ్వాసంతో ప్రతి ఏడాది వేలాది మంది ఈ శిబిరానికి హాజరవుతుంటారని నిర్వాహకులు తెలిపారు. గత అనేక సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తూ ప్రజలకు ఆరోగ్య సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు ఆస్థమా బాధితులకు అవసరమైన సూచనలు, ఆరోగ్య సలహాలు అందించనున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారు ఈ సేవలను పొందవచ్చని తెలిపారు. జూన్ 8వ తేదీ సోమవారం మధ్యాహ్నం 1.33 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు, జూన్ 9వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు వెల్లడించారు. ఆస్థమా మరియు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉచిత వైద్య సేవలను పొందాలని ఆశ్రమ నిర్వాహకులు కోరారు. సామాజిక ఆరోగ్య శ్రేయస్సు లక్ష్యంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 90953 83940, 94912 48247 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

## మేడ్చల్‌లో ఎస్ఎస్ బేకరీలో చోరీ

- **రూ.60 వేల నగదు, ల్యాప్‌టాప్‌తో ఉడాయించిన దొంగలు..**

**వ్యాపారుల్లో ఆందోళన**

**మేడ్చల్, జూన్ 5 (నగరనిజం)**మేడ్చల్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ ప్రాంతంలో ఉన్న ఎస్ఎస్ బేకరీలో అర్ధరాత్రి జరిగిన చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. దొంగలు బేకరీ వెనుక వైపు నుంచి ప్రవేశించి తాళాలు పగులగొట్టి లోపలికి చేరి నగదు, ల్యాప్‌టాప్‌తో పాటు ఇతర విలువైన వస్తువులను అపహరించినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. మేడ్చల్ హైవేపై వివేకానంద విగ్రహం సమీపంలో ఉన్న ఎస్ఎస్ బేకరీ వెనుక భాగంలోని తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం బేకరీలో ఉన్న సుమారు రూ.60 వేల నగదు, ఒక ల్యాప్‌టాప్, చాక్లెట్ డబ్బాలు మరియు ఇతర వస్తువులను దొంగిలించి పరారయ్యారు. ఉదయం బేకరీ సిబ్బంది దుకాణం తెరిచిన సమయంలో చోరీ జరిగిన విషయం గుర్తించి యాజమాన్యానికి సమాచారం అందించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ప్రాథమిక వివరాలు సేకరించారు. ప్రధాన రహదారిపై, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలోనే ఈ చోరీ జరగడం స్థానిక వ్యాపారులను ఆందోళనకు గురిచేస్తోంది. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతంలో దొంగలు ఇంత ధైర్యంగా చోరీకి పాల్పడటం భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇటీవలి కాలంలో పట్టణంలో రాత్రి వేళల్లో పోలీసు గస్తీ తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. రాత్రి సమయంలో గస్తీని మరింత పటిష్టం చేసి, చోరీల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యాపారులు, ప్రజలు పోలీసు అధికారులను కోరుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తు చేపట్టారు. నిందితులను త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

# తెలంగాణ రైతాంగానికి వరం కానున్న కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్





- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో ప్రపంచ స్థాయి మార్కెట్ నిర్మాణం**
- **ముఖ్యమంత్రి కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**రంగారెడ్డి ప్రతినిధి, జూన్ 5 ( నగరనిజం ) :** తెలంగాణ రైతాంగ భవిష్యత్తుకు కొత్త దిశానిర్దేశం చేసే కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్ రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధిలో మైలురాయిగా నిలవనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కోహెడలో శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... గతంలో నిలిచిపోయిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో పునరుద్ధరించి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) అనుసంధానం, రవాణా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని కోహెడ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. 239 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న ఈ మార్కెట్‌లో పండ్లు, కూరగాయలు, పూలు, మాంసం, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు--అమ్మకాలు, ఎగుమతి--దిగుమతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆధునిక గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ పార్కులు, ప్రాసెసింగ్ యూనిట్లు, రవాణా కేంద్రాలు వంటి ప్రపంచ స్థాయి మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మూడు దశల్లో మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, తొలి దశ పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రైతు భరోసా, రైతు బీమా, పంటల కొనుగోలు వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు విస్తృత స్థాయిలో మద్దతు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కోహెడ ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తెలంగాణ వ్యవసాయ, ఉద్యానవన రంగాల అభివృద్ధికి నూతన ఊపునివ్వనుందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేయడం ఈ మార్కెట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... కోహెడలో నిర్మించనున్న అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తెలంగాణ రైతాంగానికి, వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరంగా నిలవనుందని, సుమారు 239 ఎకరాల్లో, ఔటర్ రింగ్ రోడ్‌కు ఆనుకుని నిర్మించనున్న ఈ మార్కెట్ దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించే అవకాశం కల్పించడంతో పాటు, వినియోగదారులు ఒకే చోట నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే విధంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నగరానికి మణిహారంగా నిలిచే ఈ మార్కెట్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, మార్కెట్‌లోని ధరలు, లభ్యమయ్యే ఉత్పత్తుల వివరాలు ప్రజలు ఇంటి నుంచే తెలుసుకునే విధంగా వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రైతు--వినియోగదారుల మధ్య ప్రత్యక్ష అనుసంధానం కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, ప్రజాప్రతినిధులు, సభ్యులు హాజరుకానుండగా, వారి రవాణా, పార్కింగ్, తాగునీరు, భద్రత, విశ్రాంతి తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రదర్శనలు, సమాచార కేంద్రాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ సంస్థ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర వ్యవసాయం, సహకార శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, మార్కెటింగ్ శాఖ కమిషనర్ గోపి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## సైకిల్ ర్యాలీతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి


- **ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్ నుంచి కొత్తపేట వరకు అవగాహన ర్యాలీ- మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు పిలుపు**



**ఎల్బీనగర్, జూన్ 5 (నగర నిజం):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం దిల్‌సుఖ్‌నగర్ నుంచి కొత్తపేట వరకు సైకిల్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, ప్రకృతి వనరుల క్షీణత మానవ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ అత్యవసరమైందని అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనాన్ని పెంపొందించేందుకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి పరిసరాలు, కాలనీలు, విద్యాసంస్థలు, కార్యాలయాల్లో మొక్కలు నాటడం ద్వారా ప్రకృతిని సంరక్షించవచ్చని తెలిపారు. ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించగలమన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వనరులను సంరక్షించడం, చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచడం, వాతావరణ మార్పుల ప్రభావాలను తెలియజేయడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం మరియు ప్రకృతి వనరులను సంరక్షించడం అని పేర్కొన్నారు. "పర్యావరణాన్ని కాపాడుదాం - భవిష్యత్తును రక్షిద్దాం", "ఒక్క మొక్క ఎన్నో ప్రాణాలకు ఆధారం", "ప్రకృతి మన సంపద - పరిరక్షణ మన బాధ్యత" అనే సందేశాలతో ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, సత్యం చారి, గండి సన్నీ యాదవ్, రవి ముదిరాజ్, గండికోట శ్రీనాథ్, ముద్ద కళ్యాణ్, ప్రదీప్, సదానంద్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంపదలో అంబానీని దాటేసిన చైనా బిలియనీర్..

- **92.8 బిలియన్ డాలర్లతో ఆసియా కుబేరుల్లో రెండో స్థానానికి ఝాంగ్ యిమింగ్**



సంపదలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని చైనాకు చెందిన 'టిక్‌టాక్' వ్యవస్థాపకుడు ఝాంగ్ యిమింగ్ వెనక్కి నెట్టారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజా నివేదిక ప్రకారం.. జాంగ్ నికర ఆస్తి విలువ 92.8 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో ముకేశ్ అంబానీ (86.9 బిలియన్ డాలర్లు) మూడో స్థానానికి పడిపోయారు. ఝాంగ్ ఆసియాలోనే రెండో అత్యంత ధనవంతుడిగా, చైనాలోనే నంబర్-1 కుబేరుడిగా అవతరించారు. ప్రస్తుతం ఈ జాబితాలో భారత్‌కు చెందిన గౌతమ్ అదానీ (117.4 బిలియన్ డాలర్లు) అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. చైనాలోని ఫుజియాన్ ప్రాంతంలో జన్మించిన 43 ఏళ్ల ఝాంగ్ యిమింగ్.. నాంకై విశ్వవిద్యాలయం నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆరంభంలో మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థల్లో పనిచేసిన ఆయన 2012లో బీజింగ్‌లోని ఓ చిన్న అపార్ట్‌మెంట్ రూమ్ నుంచి 'బైట్‌డ్యాన్స్' కంపెనీని ప్రారంభించారు. కేవలం సంప్రదాయ ఎడిటర్ల సాయం లేకుండా అల్గారిథమ్స్ ఆధారంగా యూజర్లకు నచ్చిన కంటెంట్‌ను అందించే 'టౌటియావో' అనే న్యూస్ ప్లాట్‌ఫామ్‌ను సృష్టించారు. ఆ తర్వాత ఆయన తెచ్చిన షార్ట్ వీడియో యాప్ 'టిక్‌టాక్' ప్రపంచవ్యాప్తంగా వంద కోట్ల మందికి పైగా యూజర్లతో సంచలనం సృష్టించింది. ప్రస్తుతం టిక్‌టాక్ సక్సెస్‌తో పాటు, బైట్‌డ్యాన్స్ రూపొందించిన 'దౌబావో' అనే ఏఐ చాట్‌బాట్ చైనాలోనే అత్యంత ప్రజాదరణ పొందింది. బ్లాక్‌రాక్, ఫిడిలిటీ వంటి అంతర్జాతీయ ఇన్వెస్టర్లు బైట్‌డ్యాన్స్ విలువను భారీగా పెంచడంతో ఝాంగ్ సంపద ఒకేసారి 24 బిలియన్ డాలర్లు పెరిగింది. ఒకప్పుడు చమురు, రియల్ ఎస్టేట్ రంగాలు కుబేరులను సృష్టిస్తే.. ఈ ఏఐ యుగంలో కేవలం ఒక కోడింగ్ అల్గారిథమ్‌తో ప్రపంచాన్నే శాసించవచ్చని ఝాంగ్ యిమింగ్ నిరూపించారు.

నగర నిజం



# తూప్రాన్ లో కోర్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

**పాత ఎంపీడీవో కార్యాలయ భవనం కోర్టుకు అప్పగింత**

**జులై 31లోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు జిల్లా న్యాయమూర్తి ఆదేశం**

**ఆగస్టులో కోర్టు ప్రారంభానికి సన్నాహాలు**

**మౌలిక వసతుల కల్పనకు రూ.30 లక్షలు మంజూరు**

**ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన జిల్లా న్యాయమూర్తి**



మెదక్ బ్యూరో,నగర నిజం: తూప్రాన్, జూన్ 5తూప్రాన్ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కోర్టు ఏర్పాటు కల సాకారం కానుంది. తూప్రాన్ పట్టణంలో కోర్టు స్థాపనకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రతిపాదిత కోర్టు భవనంగా గుర్తించిన పాత ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని జిల్లా న్యాయమూర్తి శ్రీమతి నీలిమ, అదనపు జిల్లా న్యాయమూర్తి సంతోష్ కుమార్ శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించి కోర్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా పాత ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని కోర్టు అవసరాల కోసం అధికారికంగా అప్పగించారు. భవనాన్ని పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి, కోర్టు కార్యకలాపాలకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జులై 31వ తేదీలోపు అన్ని మరమ్మతులు, అభివృద్ధి పనులు పూర్తి చేసి భవనాన్ని సిద్ధం చేయాలని కాంట్రాక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### రూ.30 లక్షలతో ఆధునిక సౌకర్యాలు

తూప్రాన్ కోర్టు ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, భవన మరమ్మతులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, ఫర్నిచర్, కోర్టు హాళ్లు, న్యాయమూర్తుల గదులు, న్యాయవాదుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, రికార్డు గదులు, ప్రజల కోసం నిరీక్షణ మందిరాలు తదితర సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఇప్పటికే రూ.30 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో భవనాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించి కోర్టు నిర్వహణకు అనువుగా తీర్చిదిద్దనున్నారు.

### ఆగస్టులో కోర్టు ప్రారంభం

పనులు నిర్ణీత గడువులోగా పూర్తైతే ఆగస్టు నెలలోనే తూప్రాన్ కోర్టు కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు న్యాయశాఖ వర్గాలు తెలిపాయి. కోర్టు ప్రారంభం కావడం ద్వారా తూప్రాన్‌తో పాటు పరిసర మండలాల ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువ కానున్నాయి. ప్రస్తుతం చిన్న, మధ్యస్థాయి న్యాయ వ్యవహారాల కోసం మెదక్, సంగారెడ్డి, గజ్వేల్, సిద్దిపేట తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్న ప్రజలకు ఇక స్థానికంగానే న్యాయం అందుబాటులోకి రానుంది.

### ప్రజల చిరకాల కోరిక నెరవేరుతున్న వేళ

తూప్రాన్ పట్టణం వాణిజ్య, విద్యా, పరిపాలనా కేంద్రంగా అభివృద్ధి చెందినప్పటికీ కోర్టు లేకపోవడం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. కోర్టు ఏర్పాటుకు స్థానిక న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థలు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ వచ్చారు. తాజాగా జిల్లా న్యాయమూర్తి స్వయంగా భవనాన్ని పరిశీలించడం, నిధుల మంజూరు, పనుల గడువు నిర్ణయించడం వంటి పరిణామాలతో కోర్టు ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంది.

### పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల నాటకం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయమూర్తి శ్రీమతి నీలిమ, అదనపు జిల్లా న్యాయమూర్తి సంతోష్ కుమార్‌లు ప్రతిపాదిత కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ హరితహారం కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. తూప్రాన్‌లో కోర్టు ఏర్పాటు ప్రక్రియకు జిల్లా న్యాయమూర్తి పర్యటన కీలక మలుపుగా మారగా, ఆగస్టు నాటికి కోర్టు అందుబాటులోకి వస్తుందన్న ఆశాభావం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, న్యాయవాదులు బొద్దు శ్రీనివాస్, ఎం. అశోక్, వేణుగోపాల్ చారి, శివకుమార్, శ్రీపతిరావు, అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు, న్యాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మెట్రో రైల్లో ఎమ్మెల్యేల ప్రయాణం

**"వాహన కాలుష్యాన్ని తగ్గిద్దాం -- పర్యావరణాన్ని కాపాడుదాం" సందేశంతో అవగాహన**



ఎల్బీనగర్, జూన్ 5 (నగర నిజం) ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని "వాహన కాలుష్యాన్ని తగ్గిద్దాం -- పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కలిసి మెట్రో రైల్లో ప్రయాణించారు. ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, పెరుగుతున్న వాహనాల సంఖ్య కారణంగా కాలుష్యం తీవ్రస్థాయికి చేరుకుంటోందని, ప్రజలు వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి మెట్రో, బస్సులు వంటి ప్రజా రవాణా వ్యవస్థలను ఎక్కువగా వినియోగించాలని సూచించారు. ప్రజా రవాణా వినియోగం వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. పర్యావరణాన్ని కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త మధు సాగర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు ప్రజా రవాణా వినియోగంపై అవగాహన కల్పిస్తూ పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన మొగిలి సోహాని




మేడిపల్లి జూన్ 05 (నగర నిజం) జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) విద్యార్థిని మొగిలి సోహాని 2025 సంవత్సరానికి నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలో ప్రతిభ కనబర్చి స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. కొండాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఈ ఘనత సాధించడం పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్న ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సోహానిని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థిని విజయానికి సహకరించిన ఉపాధ్యాయ బృందాన్ని గ్రామ పెద్దలు అభినందించారు. సోహాని సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ స్కూల్లో సాధించిన ఈ ఫలితం తో పాటు ఈ సంవత్సరం వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 60 మంది విద్యార్థులకు గాను 23 మంది విద్యార్థులు 500 పైన మార్కులు సాధించి , 100 % శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అంకతి లింగారెడ్డి నగర నిజం ప్రతినిధితో స్కూల్ ఫలితాల తో పాటు మా తోటి ఉపాధ్యాయులమంతా క్రమశిక్షణతో విద్యార్థులను ముందుకు తీసుకెళుతున్నామని , ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు పొందామని విశేషాలను తెలిపారు.

# బీడీ కార్మికుల హక్కుల కోసం పోరాడిన నాయకురాలిని స్మరించిన కార్మికులు



మల్లాపూర్ ,జూన్ ,5 (నగర నిజం) జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన బీడీ కార్మిక నాయకురాలు పొలస శకుంతలకి శుక్రవారం బీడీ కార్మికులు, సంఘాల ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బీడీ కంపెనీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీడీ కార్మికుల హక్కుల సాధన కోసం ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన నాయకురాలిగా ఆమెను స్మరించుకున్నారు. ఆమె మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీడీ కార్మికులు, కుటుంబ సభ్యులు, టేకేదారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సంతాప సూచకంగా రెండు నిమిషాల మౌనం పాటించారు.

# 12 సంవత్సరాల మోదీ ప్రభుత్వ విజయోత్సవాలు - ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమం





మీర్పేట్ డివిజన్ జూన్ 5 (నగర నిజం)రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం, జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్––మీర్పేట్ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 12 సంవత్సరాల మోదీ ప్రభుత్వ విజయోత్సవాలు మరియు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా "ఏక్ పెడ్ మా కే నామ్" వృక్షారోపణ, మొక్కల నాటకం, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్, రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు, జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ సూచనల మేరకు మీర్పేట్ డివిజన్‌లోని మంత్రాల చెరువు సమీపంలో డివిజన్ అధ్యక్షులు తులసి ముకేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి, మహేశ్వరం అసెంబ్లీ ఇంచార్జి అందేల శ్రీరాములు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గుప్తా, రాష్ట్ర నాయకులు శంకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, జిల్లా నాయకులు మల్లారెడ్డి, కార్యదర్శులు విజయలక్ష్మీ రాజు, నీలా రవి నాయక్, ప్రశాంతి హిల్స్ అధ్యక్షులు బిక్షపతి చారి, నాదర్గుల్ డివిజన్ అధ్యక్షులు వీర కర్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**అనాధ పిల్లలకి అల్పాహారం, బిస్కెట్లు పంపిణీ**

**జీహెచ్ఎంసీ కార్మికులకు చీరలను పంపిణీ**

**200 మందికి అన్నదాన కార్యక్రమం**

**సేవా కార్యక్రమాలతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సందడి**







ఎల్బీనగర్, జూన్ 5 (నగర నిజం) చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఆదర్శ ఫౌండేషన్‌లో అనాధ పిల్లల మధ్య కేక్ కట్ చేసి వారికి అల్పాహారం, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం చైతన్యపురి ప్రాంతంలో సుమారు 200 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించి భోజనాన్ని పంపిణీ చేశారు. అలాగే న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో జీహెచ్ఎంసీ కార్మికులకు చీరలను పంపిణీ చేసి వారి సేవలను అభినందించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని స్థానిక కాలనీవాసులకు మజ్జిగ పంపిణీ చేసి దాహార్తిని తీర్చారు. అనంతరం చంద్రశేఖర్ రెడ్డి కటౌట్‌కు పాలాభిషేకం నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, శోభారాణి, సాయి ప్రశాంత్, చింటు, జలంధర్, పులి కిరణ్, నరేష్, శ్రీధర్, గణేష్, అఖిల్, నాగరాజు, వెంకన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు చంద్రశేఖర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.



# నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఆధ్వర్యంలో హరితోత్సవం**

**ప్రకృతిని కాపాడుకుందాం.. భవిష్యత్తును రక్షించుకుందాం: అతిథులు**



ఖమ్మం: (నగర నిజం బ్యూరో) జూన్ 5,నేలకొండపల్లి : ప్రకృతిని రక్షించుకోవడం అంటే మన భవిష్యత్తునుకాపాడుకోవడమేనని, విపత్కర వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ప్రకృతి ఆధారిత పరిష్కారాలను అన్వేషించాల్సిన అత్యవసర సమయం ఆసన్నమైందని ధమ్మ పద బుద్ధవిహార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బంతే సద్దా రాక్కిత పిలుపునిచ్చారు. గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక చారిత్రక బౌద్ధ క్షేత్ర ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా నిర్వహించిన హరిత వేడుకల్లో భాగంగా.. ముఖ్య అధిదులుగా నేలకొండపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, బంతే సద్దా రాక్కిత పాల్గొని క్షేత్ర ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ ప్రధానాంశమైన ప్రకృతి నుండి ప్రేరణ.. వాతావరణం కోసం, మన భవిష్యత్తు కోసం అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో ఆచరణలో పెట్టాలని కోరారు. ప్రకృతి మనకు నిజమైన మార్గదర్శి అని, సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించేందుకు పర్యావరణ సమతుల్యత ఎంతో అవసరమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రకృతి పరిరక్షణలో ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని, అయితే పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం వారి విధి మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ హరిత సంకల్పంలో గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ అధ్యక్షులు డి.రవికుమార్, 7వ వార్డు సభ్యులు యలమంద, కాసాని నాగేశ్వరరావు, బౌద్ధ ఉపాసకులు ఇదయ్య, కళ్యాణ్, క్షేత్ర వాచ్మెన్ స్టాలిన్, వర్కర్ సత్యవతి తదితరులు పాల్గొని, నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.


# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**పాతూరి వెంకటస్వామి గౌడ్**



అక్బర్‌పేట భూంపల్లి మండలం, జూన్ , 5,(నగర నిజం): తాళ్లపల్లి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, గ్రామ సర్పంచ్ నీల ప్రభాకర్, ఉప సర్పంచ్ నవీన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా పాతూరి వెంకటస్వామి గౌడ్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని అన్నారు.పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు చెట్ల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అమరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ గోపరి స్వామి, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి, ఆశా వర్కర్ కవిత, గోపరి అర్జున్, వెలుపుల రాజయ్య, పెద్దోళ్ల అంజయ్య, బోడోళ్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి ఆలయ ప్రధాన కార్యదర్శిగా పోటీలో అయిత సత్యనారాయణ




గజ్వేల్ ప్రజ్ఞాపూర్, జూన్ ,5,(నగర నిజం): గజ్వేల్ శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం ప్రధాన కార్యదర్శిగా పోటీ చేస్తున్న అయిత సత్యనారాయణ.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆలయ శాశ్వత సభ్యులు ఓటు వేసి గెలిపించాలని కోరుకుంటూ, సేవ చేయడమే నా లక్ష్యం అయ్యప్ప దేవాలయం అభివృద్ధి కోసం నిస్వార్థంగా పని చేస్తానని, నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు. అయ్యప్ప స్వామికి సేవ చేయడానికి, ఆలయ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను. దయచేసి అందరూ మీ అమూల్యమైన ఓటు నాకు వేయాలని కోరుతున్నాను.జూన్ 7 ఆదివారం అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఎన్నికలు ఉదయం 9 - 30 నుండి సాయంత్రం 4 - 30 వరకు జరగనున్న ఓటింగ్ లో అందరూ పాల్గొని ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

# పర్యావరణ పరిరక్షణ.. ప్రతి ఒక్కరి బాధ్యత

**గజ్వేల్ సిఐ రవి కుమార్**



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ , జూన్,5,(నగర నిజం): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గజ్వేల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సిఐ రవికుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ అడవుల నరికివేత కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు. ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు.మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా స్వీకరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సై నవీన్, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు

# ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన బొల్లారపు కృతిక సాక్షి




మల్లాపూర్ జూన్ 05 (నగర నిజం) జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రేగుంట గ్రామానికి చెందిన జడ్పీహెచ్ఎస్ రేగుంట స్కూల్లో చదువుతున్న విద్యార్థిని బొల్లారపు కృతిక సాక్షి జాతీయ ఆదాయ-ప్రతిభా ఆధారిత ఉపకార వేతనం (చీవీమీా) పరీక్షలో ప్రతిభ కనబర్చి స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఆమె సాధించిన ఈ విజయంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.కృతిక సాక్షి కృషి, పట్టుదలతో ఈ విజయాన్ని సాధించిందని ఉపాధ్యాయులు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆమె ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు ఆమెను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# తగ్గేదేలే అంటున్న నేలకొండపల్లి బిల్డర్స్ చివరకు తలొగ్గిన కోదాడ బిల్డర్స్

**రెండు రోజులగా పోరాటం.చివరకు చెన్నారం సుతార్ల యూనియన్ విజయగర్జన!**

**నేలకొండపల్లి : జూన్ 1 నిబంధనల ఉల్లంఘనపై కఠిన వైఖరి -- రెండు రోజుల పోరాటం తర్వాత జరిమానా చెల్లించిన బిల్డర్ సమిష్టి పోరాటానికి దక్కిన విజయం**



ఖమ్మం: (నగరం నిజం బ్యూరో)జూన్ 5:చెన్నారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రెండు రోజులుగా చేపట్టిన పోరాటం విజయవంతమైంది. యూనియన్ నిబంధనలను ఉల్లంఘించి జూన్ 1న గ్రామానికి చెందిన ఓ రైతు ఇంటి నిర్మాణ పనులు చేపట్టిన కోదాడకు చెందిన బిల్డర్, అతని సుతార్లు చివరికి యూనియన్ నిబంధనలకు తలొగ్గాల్సి వచ్చింది.యూనియన్ నిబంధనలను అమలు చేయాలని కోరుతూ చెన్నారం యూనియన్ నాయకులు, కార్మికులు గత రెండు రోజులుగా నిరంతర పోరాటం చేపట్టారు. ఈ క్రమంలో పనులు నిలిపివేసి తమ ఐక్యతను చాటారు. మరోవైపు, పనులు అడ్డుకున్నారంటూ ఇంటి యజమాని కొందరు యూనియన్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేయడం వివాదానికి దారితీసింది. అయినప్పటికీ యూనియన్ నాయకులపై రాజకీయ వొత్తిళ్లు ఎదురయినా వెనక్కి తగ్గకుండా నిబంధనల అమలుకే కట్టుబడి నిలిచారు. చివరకు కోదాడకు చెందిన బిల్డర్ యూనియన్ పెద్దల సమక్షంలో నిబంధనల ప్రకారం జరిమానా చెల్లించడంతో వివాదానికి ముగింపు పడింది. దీంతో చెన్నారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కార్మికులు “కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి”, “యూనియన్ జిందాబాద్” అంటూ నినాదాలు చేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు ఖాజా, చెన్నారం యూనియన్ అధ్యక్షుడు బట్టపోతుల విజయ్ మాట్లాడుతూ, యూనియన్ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే భవిష్యత్తులో కూడా జరిమానా తప్పదని హెచ్చరించారు. ఇది ఒక్కరి విజయం కాదని, యూనియన్ సమిష్టి శక్తి సాధించిన విజయమని నాయకులు పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, యూనియన్ గౌరవం కోసం చేసిన పోరాటానికి ఈ పరిణామం నిదర్శనమని వారు తెలిపారు. మొదటి నుండి మాకు అండగా నిలిచి మా యూనియన్ విజయానికి సహకరించిన జర్నలిస్ట్ సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.’


# నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఆధ్వర్యంలో హరితోత్సవం**


**ప్రకృతిని కాపాడుకుందాం.. భవిష్యత్తును రక్షించుకుందాం: అతిథులు**




ఖమ్మం: (నగర నిజం బ్యూరో) జూన్ 5,నేలకొండపల్లి : ప్రకృతిని రక్షించుకోవడం అంటే మన భవిష్యత్తునుకాపాడుకోవడమేనని, విపత్కర వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ప్రకృతి ఆధారిత పరిష్కారాలను అన్వేషించాల్సిన అత్యవసర సమయం ఆసన్నమైందని ధమ్మ పద బుద్ధవిహార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బంతే సద్దా రాక్కిత పిలుపునిచ్చారు. గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక చారిత్రక బౌద్ధ క్షేత్ర ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా నిర్వహించిన హరిత వేడుకల్లో భాగంగా.. ముఖ్య అధిదులుగా నేలకొండపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, బంతే సద్దా రాక్కిత పాల్గొని క్షేత్ర ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ ప్రధానాంశమైన ప్రకృతి నుండి ప్రేరణ.. వాతావరణం కోసం, మన భవిష్యత్తు కోసం అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో ఆచరణలో పెట్టాలని కోరారు. ప్రకృతి మనకు నిజమైన మార్గదర్శి అని, సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించేందుకు పర్యావరణ సమతుల్యత ఎంతో అవసరమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రకృతి పరిరక్షణలో ప్రభావవంతంగా పనిచేస్తున్నాయని, అయితే పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం వారి విధి మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ హరిత సంకల్పంలో గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ అధ్యక్షులు డి.రవికుమార్, 7వ వార్డు సభ్యులు యలమంద, కాసాని నాగేశ్వరరావు, బౌద్ధ ఉపాసకులు ఇదయ్య, కళ్యాణ్, క్షేత్ర వాచ్మెన్ స్టాలిన్, వర్కర్ సత్యవతి తదితరులు పాల్గొని, నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# గుజ్జేటి శ్రీనివాస్ మనవరాలు కార్యక్రమంలో

**మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి**



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ , జూన్, 5,(నగర నిజం): మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ నాలుగవ వార్డుకు చెందిన గుజ్జేటి శ్రీనివాస్ మనవరాలు 21 డే కార్యక్రమంలో పాల్గొన మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మర్కంటి కనకయ్య,తుమ్మ నర్సింలు, కాటుకళ్యాణ్, ఎల్ల నరేష్, కోనమైన రాజు యాదవ్, సతీష్ యాదవ్, శివాజీ యూత్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# సూపర్ సీడ్స్ కంపెనీపై గ్రామస్థుల ఫిర్యాదు..

## పంచాయతీ ఆదాయానికి నష్టం కలిగిస్తున్నారని ఆరోపణ



మెదక్ బ్యూరో : నగర నిజం :మనోహరాబాద్ గ్రామంలోని సూపర్ సీడ్స్ కంపెనీ నూతనంగా నిర్మించిన షెడ్‌కు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి అసెస్మెంట్ నంబర్ ఇవ్వలేదని, అలాగే ఎలాంటి పన్నులు (టాక్స్) వసూలు చేయడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. దీంతో గ్రామ పంచాయతీకి రావాల్సిన ఆదాయం నష్టపోతుందని పేర్కొంటూ గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.కంపెనీ నిర్మాణంపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం పన్నులు విధించాలని, గ్రామ పంచాయతీ ఆదాయానికి నష్టం కలిగించినట్లయితే సంబంధిత సంస్థపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు వినతిపత్రం ద్వారా కోరారు.

# ఆటోలో తీసుకెళ్లి మహిళ బంగారు కమ్మలు దోచుకున్న ఇద్దరు అరెస్ట్ : తూప్రాన్ సీఐ వెంకట్రాజ్ గౌడ్

**ఎల్దుర్తి పోలీసుల చాకచక్యంతో కేసు ఛేదన**

**దొంగిలించిన బంగారు కమ్మలు, ఆటో స్వాధీనం**




మెదక్ బ్యూరో: నగర నిజం: ఎల్దుర్తి, జూన్ 5:ఎల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళను ఆటోలో ఎక్కించుకుని నిర్జన ప్రాంతానికి తీసుకెళ్లి బంగారు చెవి కమ్మలు దోచుకున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, మే 30న ఎల్దుర్తి మండలంలోని సెంట్రల్ బ్యాంక్ సమీపంలో రాజమ్మ అనే మహిళను నిందితులు మద్దూరి శ్రీకాంత్, ఎండి శైలాని ఆటోలో ఎక్కించుకుని ఆరేగూడెం వద్ద దింపుతామని నమ్మించారు. అనంతరం బస్వాపూర్ గ్రామ శివారులోని చెరువు కట్ట ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో బెదిరించి ఆమె చెవి కమ్మలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు జూన్ 5న తూప్రాన్-నర్సాపూర్ బ్రిడ్జి వద్ద నిందితులను పట్టుకుని అరెస్ట్ చేశారు. నిందితుడు మద్దూరి శ్రీకాంత్ వద్ద నుంచి ఆటోను స్వాధీనం చేసుకోగా, దొంగిలించిన బంగారు చెవి కమ్మలను కొత్తూరులోని కృష్ణ జ్యువెలరీ షాప్ నుంచి స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును ఛేదించిన తూప్రాన్ సీఐ వెంకట్రాజ్ గౌడ్, ఎల్దుర్తి ఎస్సై జ్యోతి, సిబ్బంది గోవర్ధన్ రావు, కృష్ణ, సురేష్, మహేష్‌లను తూప్రాన్ డీఎస్పీ అభినందించి తగిన రివార్డులు అందజేస్తామని తెలిపారు.


# కోహెడ పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలి

## యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్ కుమార్ గౌడ్



అబ్దుల్లాపూర్ మెట్, 5 జూన్ (నగర నిజం) :అంతర్జాతీయ స్థాయిలో, ఆసియాలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌గా రూపుదిద్దుకోనున్న కోహెడ గ్రామంలోని పండ్ల మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్ కుమార్ గౌడ్ మూల పిలుపునిచ్చారు.నేడు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కోహెడ గ్రామంలో పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు అబ్దుల్లాపూర్ మెట్ మండలంతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని డివిజన్ల కాంగ్రెస్ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు అందరూ మద్దతుగా నిలిచి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రవీణ్ కుమార్ గౌడ్ మూల విజ్ఞప్తి చేశారు. ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పాల్గొని ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలకాలని కోరారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కోహెడలో రూ. 2284.32 కోట్ల అంతర్జాతీయ పండ్ల మార్కెట్ శంకుస్థాపన



అబ్దుల్లాపూర్ మెట్; జూన్, 5 (నగర నిజం) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రంగారెడ్డి జిల్లా, కోహెడ గ్రామంలో సుమారు రూ. 2284.32 కోట్ల భారీ నిధులతో నిర్మించనున్న ప్రతిష్టాత్మక "అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్" శంకుస్థాపన మహోత్సవానికి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి గారికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మరియు వైస్ చైర్మన్ భాస్కర్ చారి ఏఎంసీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి,నవరాజు, మచ్చేందర్ రెడ్డి,రఘుపతి,గణేష్ నాయక్,అంజయ్య,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ స్కూల్ పిల్లలకు యూనిఫామ్స్ అందజేత

**14వ వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్**





గజ్వేల్ ప్రజ్ఞాపూర్, జూన్, 5,(నగర నిజం): అంగన్వాడి కేంద్రాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగన్వాడీ స్కూల్ పిల్లలకు యూనిఫామ్స్ అందజేయుట కార్యక్రమంలో 14 వ వార్డులో గల అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి స్కూల్ ఆడపిల్లలకు రెండు జతల ఫ్రాక్స్ ,మగ పిల్లలు కు రెండు జతల డ్రెస్సులు మేడం చంద్రకళ తో కలిసి అందివ్వడం జరిగింది.ఈ సందర్భంగా కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతు పౌష్టికాహారం అందించె క్రమంలొ ప్రతినెల ఒక్కరికి 16 గుడ్లు,2.5 కిలోల బాల అమ్రుతం పిల్లలకు అందిస్తూనె గర్బిని స్రీలకు ,బాలింతలకు పౌష్టికాహారం ప్రతిరోజు 11 గంటలకు అందించబడుతుంది ,మరియు ప్రతినెల రెండవ శనివారం ,నాలుగవ శనివారం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఏఎన్ఎం వచ్చి గర్బిని స్రీలకు , ఐదు సంవత్సరాల లోపు పిల్లలు కు వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుంది అని చెప్పడం జరిగింది.అంగన్వాడీ స్కూలు ఆవరణలో పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్క ను నాటడం జరిగింది.అంగన్వాడీ కేంద్రానికి3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు వస్తారు దాదాపు 20 మంది పిల్లలు రెగ్యులర్ గ వస్తారు అని అంగన్వాడీ నిర్వహకురాలు చంద్రకళ మేడం తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆయ చీలసాగరం కమల మరియు పిల్లల తల్లి దండ్రులు పాల్గొనడం జరిగింది

# తెలంగాణ పోలీస్ సేవా పతకం స్వీకర్తకు ఘన సన్మానం




కుత్బుల్లాపూర్, 5 జూన్ (నగర నిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక పోలీస్ సేవా పతకాలలో బాలానగర్ ఇన్‌స్పెక్టర్ టి. నర్సింహారాజు అత్యుత్తమ "పోలీస్ సేవా పతకం" అందుకోవడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేయడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు మధుమోహన్ శుక్రవారం బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మధుమోహన్ మాట్లాడుతూ... శాంతిభద్రతల పరిరక్షణలో ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించే విధానం ప్రతి పోలీస్ అధికారికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. విధి పట్ల అంకితభావంతో పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువస్తున్న నర్సింహారాజుకు ఈ ప్రతిష్టాత్మక సేవా పతకం రావడం గర్వకారణమని పేర్కొన్నారు.ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి సహకరిస్తున్న ఉన్నతాధికారులు, సహచర సిబ్బంది, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో మరింత నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొని ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజుకు అభినందనలు తెలియజేశారు.

# ఘనంగా డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు

## పేదల పాలిట ఆపద్బాంధవుడు - డా. ఆలేటి శ్రీనివాస్ గౌడ్





ఎల్బీనగర్; జూన్, 5 (నగర నిజం) ఎల్‌బీనగర్ ప్రాంతంలోని ఆర్థోపెడిక్ వైద్యుడిగా సేవలందిస్తున్న డా.ఆలేటి శ్రీనివాస్ గౌడ్ అనేక సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. కీళ్ల మార్పిడి, ఎముకల వ్యాధులు, ప్రమాదాల్లో గాయపడిన వారికి చికిత్స అందించడంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వైద్య నిపుణుడిగా గుర్తింపు పొందారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ,వైద్య వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా సేవగా భావిస్తూ, ఆర్థికంగా వెనుకబడిన వారికి అందుబాటు వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారని స్థానిక ప్రజలు పేర్కొంటారు. అనేక మంది రోగులకు సకాలంలో చికిత్స అందించి వారి జీవితాల్లో ఆశాకిరణంగా నిలిచారని చెబుతారు.జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ "పేదల సేవే పరమోన్నత సేవ" అనే భావనతో ముందుకు సాగుతూ మరెన్నో సంవత్సరాలు ఆరోగ్య సేవల ద్వారా ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షిస్తూ డా. ఆలేటి శ్రీనివాస్ గౌడ్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రేయోభిలాషులు అభిమానులు బంధుమిత్రులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన బీజేపీ నాయకులు





ఎల్బీనగర్, జూన్ 5 (నగర నిజం): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా గడ్డిఅన్నారం బీజేపీ నాయకులు, కాలనీ సభ్యులతో కలిసి "బీజేపీ సీనియర్ నాయకురాలు లక్ష్మీ దేవి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లక్ష్మీ దేవి" మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టి, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమం ద్వారా తల్లి పేరుతో ఒక మొక్కను నాటడం కుటుంబ విలువలను, ప్రకృతి పరిరక్షణను కలిపే గొప్ప సందేశంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక మొక్కను నాటేలా ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం బీజేపీ సభ్యులు, కాలనీ ప్రతినిధులు, మహిళలు, యువకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సాయి కృప ప్లే స్కూల్ ప్రారంభోత్సవం



హయత్ నగర్, 5 జూన్ (నగర నిజం) :ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సత్య నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సాయి కృప ప్లే స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్కూల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ అందించడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని అన్నారు. చిన్నారుల మానసిక, శారీరక వికాసానికి ప్లే స్కూల్స్ ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.విద్యారంగంలో సేవాభావంతో ముందుకు వస్తున్న సాయి కృప ప్లే స్కూల్ యాజమాన్యాన్ని అభినందించిన ఆయన, ఈ విద్యాసంస్థ మరెన్నో విజయాలు సాధించి ప్రాంతంలోని చిన్నారులకు ఉత్తమ విద్యను అందించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, తల్లిదండ్రులు, కాలనీవాసులు పాల్గొని స్కూల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తగా ప్రారంభమైన ఈ విద్యాసంస్థ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించడంలో కీలక పాత్ర పోషించాలని వారు ఆకాంక్షించారు.

# జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలి: పులి పలుపల ఆనందం



హైదరాబాద్, 5 జూన్ (నగర నిజం) :దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు జాతీయ స్థాయిలో పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని సీనియర్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు పులి పలుపల ఆనందం కోరారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పులి పలుపల ఆనందం మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలులో ఉందని, దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఒకే విధమైన జాతీయ పెన్షన్ విధానం అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టేలా సిఫారసు చేయాలని కోరినట్లు తెలిపారు.అలాగే సీనియర్ పాత్రికేయుల కోసం జాతీయ వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేయాలని, పదవీ విరమణ చేసిన సీనియర్ న్యాయమూర్తి ఆధ్వర్యంలో జాతీయ మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు సామాజిక భద్రత, సంక్షేమ పరిరక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, రత్న చోటి రాణి పాల్గొన్నారు.

# రావి నారాయణ రెడ్డి ఆశయాలు యువతకు ఆదర్శం: ఆందోజు రవీంద్రచారి



అబ్దుల్లాపూర్ మెట్, 5, జూన్ (నగర నిజం) :స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకుడు, నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యుడు కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి 118వ జయంతి సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్ మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నాగోల్ సర్కిల్, పెద్ద అంబర్పేట్ పరిధిలోని భూ పోరాట కేంద్రం పేదల సమూహం గుడిసెల వద్ద జయంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పాల్గొని రావి నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్రచారి మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులు, అనగారిన వర్గాల హక్కుల సాధన కోసం రావి నారాయణ రెడ్డి చేసిన పోరాటాలు, త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు.నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన మహానాయకుడు రావి నారాయణ రెడ్డి అని కొనియాడారు. భూ పోరాటాల ద్వారా అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో ముఖ్యంగా నల్లగొండ ప్రాంతంలో వేలాది ఎకరాల భూమిని రైతు కూలీలు, పేదలకు పంపిణీ చేయించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. తన వాటాగా వచ్చిన 400 ఎకరాల భూమిని కూడా ప్రజల కోసం దానం చేసిన ప్రజానాయకుడని గుర్తు చేశారు.1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే అధిక ఓట్లు సాధించిన నాయకుడిగా రావి నారాయణ రెడ్డి చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలైన సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం నేటి తరం నాయకులు కృషి చేయాలని, తెలంగాణ యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సామిడి శేఖర్ రెడ్డి, మండల పార్టీ సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహా, మండల కార్యవర్గ సభ్యులు పొన్నాల యాదగిరి, కాటి అరుణ, తైలి మధు, దౌల రాములు, సైదులు ముదిరాజ్, గోపి, వినోద్, ఆవుల యాదగిరి, శాయిని వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో సాధ్యం లా ప్రొఫెషనల్ అకాడమీ ప్రారంభం





అబ్దుల్లాపూర్ మెట్, 5 జూన్ (నగర నిజం) :అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని కోహెడ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన "సాధ్యం లా ప్రొఫెషనల్ అకాడమీ"ని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అకాడమీని పరిశీలించిన ఆయన, అక్కడ కల్పించిన మౌలిక వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆధునిక డిజిటల్ యుగంలో న్యాయ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులను యువ న్యాయవాదులు అందిపుచ్చుకోవాలని సూచించారు. నైతిక విలువలు, సామాజిక బాధ్యతతో కూడిన న్యాయవాదులే సమాజ అభివృద్ధికి దోహదపడతారని అన్నారు. విద్యను వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావంతో అందించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, నాణ్యమైన విద్యను అందించేలా అకాడమీ నిర్వాహకులు కృషి చేయాలని సూచించారు.అకాడమీ చైర్మన్ మునగ సతీష్ యాదవ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సైతం న్యాయ విద్యలో రాణించేలా ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం అందించడమే అకాడమీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. న్యాయ విద్యార్థులకు అవసరమైన ఆధునిక సౌకర్యాలు, నిపుణుల బోధన ద్వారా ఉత్తమ శిక్షణ అందిస్తామని చెప్పారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, విద్యార్థులు, అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.





